సాక్షి
నిజామాబాద్

గురువారం । 2 । మే । 2024

I



ఉపాధి క్షేత్రాలు..
గ్రామాల్లో ఉపాధి పనులు జోరుగా సాగుతుండడంతో రాజకీయ నాయకులు అక్కడకు వెళ్లి ప్రచారాలు నిర్వహిస్తున్నారు.
- IIలో ▸



పీహెచ్‌సీలకు నిధులందేనా?
జాతీయ స్థాయి ప్రమాణాలు పాటించే పీహెచ్‌సీలకు ప్రతియేటా నిధులు రావాల్సి ఉండగా.. రెండేళ్లుగా రావడంలేదు.
- IIలో ▸

గరిష్టం/కనిష్టం
44.1 /29.9

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



నగరంలో మధ్యాహ్నం సమయంలో ఖాళీగా ఉన్న రోడ్డు

భానుడి భగభగ..

భానుడు భగభగమంటున్నాడు. ఉదయం తొమ్మిది గంటల నుంచే తన ప్రతాపం చూపిస్తున్నాడు. గత నాలుగైదు రోజులు 43 డిగ్రీలపైనే నమోదవుతోంది. ఇక బుధవారం పగటి ఉష్ణోగ్రత 44.1 డిగ్రీలుగా నమోదైంది. ఎండతీవ్రత పెరగడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. దీంతో రోడ్లపై రద్దీ గణనీయంగా తగ్గింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



పులాంగ్ వద్ద క్యాప్‌లు పెట్టుకుని బైకుపై వెళ్తూ..

న్యూస్‌రీల్

విధుల్లో జాగ్రత్తలు పాటించాలి



నిజామాబాద్‌నాగారం: విద్యుత్ సిబ్బంది విధులు నిర్వర్తించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని శాఖ నోడల్ అధికారి అశోక్ సూచించారు. విద్యుత్ భద్రత వారోత్సవాల ప్రారంభోత్సవాల్లో భాగంగా నగరంలోని విద్యుత్ కార్యాలయంలో బుధవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో చిన్న అజాగ్రత్త కూడా ప్రమాదాలకు దారితీస్తుందని పేర్కొన్నారు. అన్ని జాగ్రత్తలు పాటిస్తూ క్షేమంగా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు రవీందర్, వెంకటరమణ, ప్రశాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, తోటరాజశేఖర్, శ్రీనివాస్, వీరేశం, పట్టణ ఏఈలు నాగ శర్వాణి, నగేశ్, గంగా శేఖర్, శ్రీవిద్య, అన్నయ్య, అసరుద్దీన్, ప్రణయ్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌కు అదనపు బ్యాలెట్ యూనిట్లు



సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అదనపు బ్యాలెట్ యూనిట్లు బుధవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌కు చేరుకున్నాయి. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి 29 మంది అభ్యర్థులు పోటీలో ఉ న్నందున పోలింగ్ నిర్వహణ కోసం రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీంతో ఎన్నికల సంఘం నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌కు హైదరాబాద్‌లోని ఈసీఐఎల్ నుంచి అదనంగా వెయ్యి బ్యాలెట్ యూనిట్లను కేటాయించింది. ఈమేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో, జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పర్యవేక్షణలో బ్యాలెట్ యూనిట్లను ఈవీఎం గోడౌన్‌లో భద్రపరిచారు. ఈసీఐఎల్ ఇంజినీర్ల ద్వారా బ్యాలెట్ యూనిట్లను మొదటి దశ పరిశీలన(ఎఫ్ఎల్‌సీ) చేపట్టారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సాకేత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్ తదితరులున్నారు.

డీఎంహెచ్‌వోగా తుకారాం బాధ్యతల స్వీకరణ



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా తుకారం రాథోడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా ఆయన ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. డీహెచ్ ఆదేశాల మేరకు కలెక్టర్ అనుమతితో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఉద్యోగులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ


కామారెడ్డి అర్బన్: స్వయం ఉపాధి కోర్సుల్లో 50 శాతం ఫీజు రాయితీలో శిక్షణ ఇవ్వనున్నట్లు సెట్విన్ కామారెడ్డి సెంటర్ సమన్వయకర్త సయ్యద్ మోయిజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీజీడీసీఏ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహందీ కోర్సులలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులు 73861 80456, 79897 59121 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లోగల శ్రావణి ఐటీఐ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఐటీసీ, తోషిబా కంపెనీలలో ఉద్యోగాల భర్తీ కోసం మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివినవారు 99899 82929, 98669 09681 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అగ్రనేతల ఆగమనం

- ప్రచారానికి మిగిలింది తొమ్మిది రోజులే..
- ఉమ్మడి జిల్లాకు రానున్న రాష్ట్ర, జాతీయ నేతలు
- 5న నిజామాబాద్‌కు రానున్న బీజేపీ అగ్రనేత అమిత్‌షా
- 6న నిజామాబాద్, 7న కామారెడ్డిలో కేసీఆర్ రోడ్‌షో
- కామారెడ్డి జిల్లాలో బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు తేజస్వి సూర్య సభకు బీజేపీ ప్లాన్
- ఆర్మూర్‌లో రాహుల్ లేదా రేవంత్ సభకు కాంగ్రెస్ యోచన
- 4వ తేదీ తర్వాత కామారెడ్డిలో రేవంత్ ప్రచారం చేసే అవకాశం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు సమయం సమీపిస్తోంది. ప్రచార పర్వానికి మరో తొమ్మిది రోజులు మాత్రమే మిగిలింది. ఈ నేపథ్యంలో నేతలు మండుటెండలోనూ ప్రచారం హోరెత్తిస్తున్నారు. అంతేకాకుండా ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర, జాతీయ నేతలు రానున్నారు. మూడు ప్రధాన పార్టీలు తమ అగ్రనేతలను క్షేత్రస్థాయి ప్రచార రంగంలోకి దించుతున్నాయి. అగ్రనేతలతో భారీ సభలను నిర్వహించి హామీలు గుప్పించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఇప్పటికే నిజామాబాద్, జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీలు ధర్మపురి అర్వింద్, బీబీ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థులు తాటిపర్తి జీవన్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, బీఆర్ఎస్ అభ్యర్థులు బాజిరెడ్డి గోవర్ధన్, గాలి అనిల్‌కుమార్ విస్తృతంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. హోరాహోరీగా చెమటోడుస్తున్నారు. ఈ క్రమంలో ఆయా పార్టీలు అగ్రనేతలను భారీ సభలకు, రోడ్‌షోలకు తీసుకొచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే గత 22వ తేదీన నిజామాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీ బహిరంగసభ నిర్వహించింది. ఈ సభలో నిజాంషుగర్స్‌ను సెప్టెంబర్ 17లోగా తెరిపిస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. తరువాత బీజేపీ గత 25వ తేదీన ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రితో నిజామాబాద్‌లో సభ నిర్వహించారు. ఇందూరులోనే పసుపు బోర్డు ఏర్పాటు కానుందని ఆయన ప్రకటించారు. అగ్రనేతల సభల ద్వారా కీలకమైన అంశాలపై హామీలు రాబట్టుకోవచ్చని అభ్యర్థులు భావిస్తున్నారు. మరోవైపు గత మంగళవారం బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆందోల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని అల్లాదుర్గ్ వద్ద జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. గత మార్చి 18న సైతం మోదీ జగిత్యాల సభలో పాల్గొన్నారు.

6న ఎల్లారెడ్డికి ప్రియాంక గాంధీ!

ప్రచారంలో భాగంగా నిజామాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఈ నెల 5న సభ నిర్వహించేందుకు బీజేపీ రంగం సిద్ధం చేసుకుంది. కీలక అంశంపై అమిత్‌షాతో హామీ ఇప్పించేందుకు ప్లాన్ చేస్తున్నారు. మరోవైపు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని కామారెడ్డి జిల్లాలోని ఏదో ఒక శాసనసభ సెగ్మెంట్ పరిధిలో బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు తేజస్వి సూర్యతో సభ ఏర్పాటుకు బీజేపీ ప్లాన్ చేస్తోంది. ఇదిలా ఉండగా ఈ నెల 6వ తేదీన కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకతో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎల్లారెడ్డిలో బహిరంగ సభ నిర్వహించేందుకు ఆ పార్టీ నాయకులు ప్లాన్ చేస్తున్నారు. ఇక 4వ తేదీ తర్వాత కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి సభకు కాంగ్రెస్ యోచిస్తోంది. అదేవిధంగా ఆ తర్వాత నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో రాహుల్‌గాంధీ లేదా రేవంత్‌రెడ్డి సభకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది.

■ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర రోడ్‌షో ఈ నెల 6వ తేదీన నిజామాబాద్ నగరంలో నిర్వహించేందుకు షెడ్యూల్ ఇచ్చారు. ఆరోజు రాత్రి కేసీఆర్ నిజామాబాద్‌లోనే బస చేయనున్నారు. ఇక 7వ తేదీన కామారెడ్డిలో కేసీఆర్ రోడ్‌షో నిర్వహించనున్నారు. ఇవే కాకుండా ఇంకా మరికొందరు అగ్రనాయకుల సభల కోసం మూడు పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లను సమీక్షించిన సీఈవో



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) వికాస్ రాజ్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా కలెక్టర్లు, ఎన్నిక ల రిటర్నింగ్ అధికారులతో ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లపై జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సీఈవో దృష్టికి తెచ్చారు. 29 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను అందజేయడంతో పాటు ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యర్థులందరికీ గుర్తులు కేటాయించామన్నారు. ఓటరు సమాచార స్లిప్పులను ఇంటింటికి తిరిగి పంపిణీ చేయిస్తున్నామన్నారు. కొత్త ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తూ, అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, 85 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగ ఓటర్లు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు కూడా రెండో విడత శిక్షణ కొనసాగుతోందని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంతో పాటు డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్లు, స్ట్రాంగ్ రూంల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలను మోహరించేలా చర్యలు తీసుకున్నామని సీఈవో దృష్టికి తెచ్చారు. సువిధ పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు అనుమతులు జారీ చేస్తున్నామన్నారు. సీ–విజిల్ ఫిర్యాదులతో పాటు జిల్లా స్థాయిలో నెలకొల్పిన కంట్రోల్ రూంకు వచ్చే ఫిర్యాదులను కూడా సకాలంలో స్పందిస్తూ చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎన్నికల్లో ప్రలోభాలను నివారించేందుకు 22 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీపీవో చక్రవర్తి తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన అబ్జర్వర్



బోధన్ పట్టణంలో ఈవీఎం స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న అబ్జర్వర్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని విజయమేరి పాఠశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల అబ్జర్వర్ ఎలిసా వజ్ ఆర్ బుధవారం పరిశీలించారు. అనంతరం పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న శిబిరాన్ని సందర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగరాదని, ప్రతి ఓటరు ఓటు వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూంలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అబ్జర్వర్ వెంట ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ గంగాధర్, ఆర్‌ఐ వరుణ్‌లు ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీ తోడు దొంగలు

- అబద్ధపు హామీలతో గద్దెనెక్కారు
- కారు పార్టీని ఓడించేందుకు కుట్రలు
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

బోధన్‌టౌన్(బోధన్): కాంగ్రెస్, బీజేపీ తోడు దొంగలేనని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిందని విమర్శించారు. బుధవారం బోధన్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని.. కేసీఆర్‌ను ఓడించి తప్పు చేశామని చెబుతున్నారని పేర్కొన్నారు. తాము గెలిస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా చేసిందేమీ లేదన్నారు. సాగు, తాగునీటి కష్టాలతో రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రని పేర్కొన్నారు. రూ. 15వేల రైతుబంధు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. కరెంటు కష్టాలతో రైతులు, ప్రజలు కన్నీలు పెట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. మాజీ ఎమ్మెల్యే షకీల్ బోధన్‌లో ఉంటే తమకు ఓట్లు రావని.. లేనిపోని కేసులు బనాయించి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఎంపీగా గెలిపిస్తే ఐదు రోజుల్లో పసుపు బోర్డు అర్వింద్ హామీ ఇచ్చారని.. బోర్డు కార్యాలయం ఎక్కడుందని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే బోధ న్– బీదర్ రైల్వేలైన్‌కు, నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, పట్టణాధ్యక్షుడు రవీందదర్ యాదవ్, డీసీసీబీ డైరక్టర్ గిర్దావర్ గంగారెడ్డి పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై కాంగ్రెస్ చిల్లర రాజకీయం

- రేవంత్‌రెడ్డి చరిత్రలో 420గా మిగిలిపోతారు
- రిజర్వేషన్ల రద్దు ప్రసక్తే లేదని మోదీ ప్రకటించారు
- ఎంపీ అర్వింద్ ధర్మపురి



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అర్వింద్ ధర్మపురి, పక్కన ఎమ్మెల్యే ధన్‌పాల్, నాయకులు పల్లె గంగారెడ్డి

సుభాష్‌నగర్: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తారని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తుందని, రిజర్వేషన్లపై చిల్లర రాజకీయాలు మానుకోవాలని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు. ప్రాణముున్నంత వరకూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు తగ్గించే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ ఇటీవల ప్రకటించారని గుర్తుచేశారు. బుధవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. తాను పదవి యావతో రాజకీయాల్లోకి రాలేదని, ప్రధాని నరేంద్ర మోదీ కోసం వచ్చానని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరుగుతున్న అత్యంత కీలకమైన ఎన్నికలని, యూనిఫాం సివిల్ కోడ్, ఎన్ఆర్‌సీ, ఇతర కీలక చట్టాలు బీజేపీ తీసుకొస్తుందని తెలిపారు. ఆరు గ్యారంటీలపై దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ నేతలు రిజర్వేషన్ల రద్దు అని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు మతాల ప్రాతిపదికన ఉన్న రిజర్వేషన్లు తీసేస్తామని మోదీ అన్నారని, ఈడబ్ల్యూఎస్ ద్వారా ముస్లిములకు రిజర్వేషన్లు కల్పించిందే మోదీ అని గుర్తుచేశారు.

రాజకీయాల్లో హుందాతనం ఉండాలి

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వెంటనే చెరుకు ఫ్యాక్టరీలు తెరిపిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, చక్కెర ఫ్యాక్టరీపై రోజుకో ప్రకటన చేయడం సరికాదని అర్వింద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంస్థతో వాల్యుయేషన్ వేయించి ఇస్తే ఫ్యా క్టరీని నెలరోజుల్లో తెరిపిస్తానని ఆయన హామీనిచ్చారు. ఖాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, తదితర పనులు కొనసాగుతున్నాయని.. అయినా మోదీ తెలంగాణకు ఏం చేశాడు.. గాడిద గుడ్డు చేశాడా అంటావా అని ముఖ్యమంత్రిపై మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి చరిత్రలో 420గా మిగిలిపోతారన్నారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నాయకులు వడ్డి మోహన్‌రెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో గళం వినిపిస్తా

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



బషీరాబాద్‌లో ప్రచారం చేస్తున్న జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: పార్లమెంట్‌లో గళం వినిపించడంతో పాటు, నిజామాబాద్ ప్రాంత అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్, కోనసముందర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉపాధి హామీ పథకం ద్వారా 150 రోజుల పనిదినాలు కల్పిస్తూ రోజుకు కనీస వేతనం రూ. 400 అదే విధంగా సంవత్సరానికి రూ. 40 వేలు ఆదాయం సమకూరేటట్లు కాంగ్రెస్ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

ప్రతి పేద మహిళకు సంవత్సరానికి రూ. లక్ష సహాయం అందే విధంగా నారీ న్యాయ్ పేరుతో కాంగ్రెస్ గ్యారంటీ హామీ అమలు చేస్తామన్నారు. అలాగే 30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి రాగానే కుల గణన చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి నాయకులు సునీల్‌రెడ్డి, ఏలేటి గంగాధర్, జక్క రాజేశ్వర్, సుంకెట రవి పాల్గొన్నారు.

నగరంలో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న సీఐ నరహరి, ఎస్సై సంజీవ్, బలగాలు

ఖలీల్‌వాడి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. నాలుగోటౌన్ పరిధిలోని బోర్గాం(పి), ఆర్యనగర్, రుక్మాణి చాంబర్, వినాయక్‌నగర్, బ్యాంక్ కాలనీలో పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ నరహరి, ఎస్సై సంజీవ్, కేంద్రబలగాలు పాల్గొన్నాయి.

క్లుప్తంగా

కొనసాగుతున్న 'ఓపెన్' పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం పదో తరగతి ఓపెన్ పరీక్షకు 8 మందికిగాను ఏడుగురు పరీక్షలు రాయగా, ఒకరు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు 1192 మందికిగాను 1083 మంది హాజరుకాగా, 109 మంది గైర్హాజరయ్యారు.

జీజీ కళాశాలకు రాష్ట్రస్థాయి బహుమతులు



నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలకు భౌతికశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో రాష్ట్రస్థాయి 2వ, 3వ బహుమతులు లభించాయి. జిజ్ఞాస స్టూడెంట్ ప్రాజెక్టుల పేరిట కళాశాల విద్యాకమిషనర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కార్యక్రమాన్ని నిర్వహించగా, జీజీ కళాశాలకు బహుమతులు లభించాయి. రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ బుర్రా వెంకటేశం చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రెండో బహుమతికి రూ.21వేల నగదు, 3వ బహుమతికి రూ.12 వేల నగదు, ప్రశంసాపత్రాలు లభించాయన్నారు. ప్రాజెక్టులో పాల్గొన్న పర్యవేక్షకుడు వజీరాభాను, కిరణ్‌కుమార్‌గౌడ్, విద్యార్థినీవిద్యార్థులను ఆయన అభినందించారు.

సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మిట్టాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ప్రభాకర్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని శిబిరాన్ని ప్రారంభించారు. శిక్షణ శిబిరానికి కోచ్‌గా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మర్కంటి గంగామోహన్ వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుశీల్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు గుండ వినయ్, హెచ్.అనికేత్, భూక్యా అంజలి, బానోత్ సంతోష్, తేజావత్ గంగాధర్, సిర్నాపల్లి సాయిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సిరికొండలో బేస్‌బాల్ శిక్షణ..



సిరికొండ: జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో సిరికొండలో బేస్‌బాల్ క్రీడా శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో భాగంగా సత్యశోధక్ పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బేస్‌బాల్ శిక్షణ శిబిరాన్ని ప్రిన్సిపల్ నర్సయ్య ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్, సంతోష్, గంగారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఐఎంబీఏ, ఐపీసీహెచ్ 4, 6, 8, 10వ (థియరీ, ప్రాక్టికల్), ఎంబీఏ, ఎంసీఏ 4వ సెమిస్టర్, ఐఎంబీఏ 8, 10వ సెమిస్టర్ పరీక్షలు జూన్/జూలై నెలల్లో నిర్వహించనున్నారు. గతంలో ఫీజు చెల్లింపునకు గడువు ఏప్రిల్ 30 వరకు ఉండగా విద్యార్థుల కోరిక మేరకు తేదీని పొడించినట్లు కంట్రోలర్ తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో మే 21వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధి క్షేత్రాలు.. ప్రచార వేదికలు

- కూలీల వద్దకే వెళ్తున్న నాయకులు
- పొద్దుపొద్దున్నే గ్రామాల్లో ప్రచార హోరు



మోర్తాడ్ మండలం సుంకెట్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్(బాల్కొండ): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు జోరుగాసాగుతుండడం, కూలీలు అధిక సంఖ్యలో పనులకు హాజరవుతుండటంతో రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచార వేదికలుగా ఉపాధి క్షేత్రాలను ఎంచుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల నాయకులు ఉపాధిహామీ పనులు జరిగే చోట ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ కూలీల ఓట్లను రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడం పూర్తి కావడంతో ప్రచారం వేడెక్కింది. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ధర్మపురి అర్వింద్, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌తోపాటు ఇతర స్వతంత్ర అభ్యర్థులు వారికి మద్దతుగా ఆయా పార్టీల నాయకులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రతి గ్రామంలో రోజుకు 200 నుంచి 250 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. పెద్ద గ్రామ పంచాయతీల్లో కూలీల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఉదయం పూటనే ప్రచారానికి అనువైన సమయం కావడం, గ్రామాల్లో అనేక మంది ఉపాధి పనులకు వెళ్తుండడంతో నాయకులు కూలీల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా..

గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించాలంటే జనసమీకరణకు ఎక్కువగానే ఖర్చు చేయాల్సి వస్తుంది. రాజకీయ పార్టీల సమావేశాలకు వచ్చే వారికి రూ.150 నుంచి రూ.300ల వరకు చెల్లించాల్సి వస్తుంది. ఉపాధిహామీ పనులు జరిగే చోట జనం ఎక్కువగా ఉంటుండటంతో తమ ప్రచారం ఎలాంటి ఖర్చు లేకుండా సాగిపోతోందని రాజకీయ పార్టీల నాయకులు భావిస్తున్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు



సాలూరలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

బోధన్: కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలని, అసెంబ్లీ ఎన్నికల్లో ఆచరణ సాధ్యం కాని ఆరుగ్యారంటీ హామీలు ఇచ్చి అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేసిందని ఎంపీ, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీలను అమలు చేయకుండా.. హిందూదేవుళ్లపై ఒట్టు వేస్తున్నారన్నారు. మహిళల ఉసురు తగిలితే బీఆర్ఎస్‌లాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సాలూర మండల కేంద్రంతోపాటు బోధన్ మండలం కల్దుర్కిలో నిర్వహించిన ప్రచారసభల్లో అర్వింద్ మాట్లాడారు.దేశ భద్రత, ధర్మ రక్షణ కోసం అవినీతి మచ్చలేని, నిఖార్సైన నిజాయితీపరుడు నరేంద్రమోదీని మరోసారి ప్రధాన మంత్రిని చేయాలని, బీజేపీని ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని, కాంగ్రెస్ అధిష్టానం ఎన్నికల తర్వాత రేవంత్‌ను సీఎం కుర్చీ నుంచి దించుతుందన్నారు. రేవంత్‌ను బీజేపీలో చేర్చుకుంటారో లేదో తెలియదని, వస్తే మంచిదేనన్నారు. తొలిసారిగా ఎన్టీఆర్ టీడీపీ టిక్కెట్‌ఇచ్చి జీవన్‌రెడ్డిని ఎమ్మెల్యేను చేస్తే ఆయనకే వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. గల్ఫ్‌బోర్డు ఏర్పాటు, షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటే.. జీవన్‌రెడ్డి ఎంపీగా పోటీ చేయడం ఎందుకని ప్రశ్నించారు. గల్ఫ్‌కార్మికుల సమస్యను కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని విమర్శించారు.

షుగర్ ఫ్యాక్టరీల అంశంలో కమిటీ మాటలు నమ్మాలా? సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నమ్మాలా? అని ప్రశ్నించారు. జిల్లాకు మరిన్ని వ్యవసాయధారిత పరిశ్రమలు, యువతకు ఉపాధి అవకాశాలు దక్కాలంటే మళ్లీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తే సాధ్యమవుతుందన్నారు. జూన్ 4న తర్వాత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయమైన యూనిఫాం సివిల్ కోడ్ ఖచ్చితంగా అమలవుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, ప్రభావరి న్యాలం రాజు, సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోనే ప్రవీణ్, మనోహర్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా



ఆర్మూర్‌లోని సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న టీఎస్ఎన్‌పీడీసీఎల్ నోడల్ ఆఫీసర్ అశోక్

ఆర్మూర్/ఆర్మూర్ టౌన్: వేసవిలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు టీఎస్ఎన్‌పీడీసీఎల్ నోడల్ ఆఫీసర్ అశోక్ తెలిపారు. జిల్లాలోని ఆర్మూర్, కమ్మర్‌పల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్లను బుధవారం తనిఖీ చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం చేపట్టిన పనులపై ఆరా తీశారు. సబ్‌స్టేషన్ల పరిధిలోని కమ్మర్‌పల్లి, నాగ్‌పూర్, ఆర్మూర్‌లో నిరంతర విద్యుత్ సరఫరా, గృహ, వాణిజ్య, వ్యవసాయ, ఇతర వినియోగదారులకు ఓవర్‌లోడ్ సమస్యలపై ఆరా తీశారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి వినియోగదారులకు నిరంతరం సేవలు అందించాలన్నారు. ఆయన వెంట పర్యవేక్షక ఇంజినీర్ ఆర్.రవీందర్, ఆర్మూర్ డివిజనల్ ఇంజినీర్ సీహెచ్ హరిచంద్, ఏడీఈ జె శ్రీధర్, ఏఈ బాలరాజు, సిబ్బంది మనీషా, అశ్రిత తదితరులున్నారు.

పది మందిపై కేసు నమోదు

రాజంపేట: మండలంలోని ఓ మారుమూల తండాలో బాలికకు పెళ్లి చేసిన ఘటనలో బాల్య వివాహ నిరోధక అధికారులు రాజంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పది మందిపై కేసు నమోదు చేశారు. పెళ్లికి హాజరైన వారితోపాటు పెళ్లి చేసిన పురోహితుడు, పెళ్లి జరిపించిన కుటుంబ సభ్యులపై కేసులు నమోదయ్యాయి. గత శనివారం జిల్లా బాల రక్ష భవన్ చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి అందిన సమాచారం మేరకు బాలల పరిరక్షణ విభాగం అధికారులు అదేరోజున పోలీసులతో కలిసి తండాకు వెళ్లి బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పెళ్లి రద్దు చేస్తామని చెప్పిన కుటుంబ సభ్యులు మరుసటి రోజున ఎవరికీ తెలియకుండా పెళ్లి చేశారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): సదాశివనగర్ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నిర్మల్ జిల్లా కడెం మండలం మాసాయిపేటకు చెందిన పంజాబీ రాహుల్(23) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా.. సదాశివనగర్ శివారులో బైక్ అదుపు తప్పడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

బైక్ పైనుంచి కింద పడి మహిళ..

అమర్లబండ గ్రామానికి చెందిన న్యాలపురం కమల(38) తన కొడుకు బైక్‌పై కామారెడ్డికి వెళ్లి తిరిగి వస్తుండగా సదాశివనగర్ బ్రిడ్జి వద్ద బైక్ పైనుంచి పడిపోయింది. ఈ ఘటనలో కమల తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆమె మృతి చెందింది. ఆయా ఘటనలకు సంబంధించి కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సు ఢీకొన్న ఘటనలో ఈజీఎస్ కూలీ..



సాయిలు (ఫైల్)

నందిపేట్(ఆర్మూర్): బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో మండలంలోని మాయాపూర్ గ్రామానికి చెందిన మేకల సాయిలు(48) మృతి చెందాడు. బుధవారం మాయాపూర్ శివారులో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. రోజూలాగే కూలీ పనికి వెళ్లిన సాయిలు మధ్యాహ్నం బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్తుండగా అతివేగంగా దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు (టీఎస్ 16యూసీ 2888) ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలై సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

వడ దెబ్బతో ఒకరు..

మాచారెడ్డి: మండలంలోని లక్ష్మీరావులపల్లి శివారు లో బుధవారం ఓ వ్యక్తి వడ దెబ్బ కారణంగా మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివ రాలు ఇలా ఉన్నాయి.. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావు పేట మండలం దమ్మన్నపేటకు చెందిన చిప్పకుర్తి బాబు(49)పదిహేను రోజుల క్రితం పాల్వంచ మండలం ఫరీదుపేటలోని కూతురి ఇంటికొచ్చాడు. పెద్దగుట్ట వెళ్తున్నానని బుధవారం ఇంటి నుంచి కాలినడకన బయల్దేరిన బాబు.. లక్ష్మీరా వులపల్లి – బండరామేశ్వరపల్లి గ్రామాల మధ్య ఓ చెట్టు నీడ సేదదీరుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఇందల్వాయి: మండలంలోని గంగారాంతండాకు చెందిన చాంద్ బేగ్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు స్థానికులు తెలిపారు. జాతీయరహదారి వెంబడి చాంద్‌బేగ్ నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రగాయలపాలైనట్లు తెలిపారు. బాధితుడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు..



నర్సయ్య (ఫైల్)

ఎడపల్లి (బోధన్): మండలంలోని ఠాణాకలాన్ గ్రామ చెరువుకట్టపై బుధవారం ట్రాక్టర్ బోల్తా పడి మఠం నర్సయ్య(50) అనే రైతు మృతి చెందాడు. 12 ఎకరాల భూమి కౌలుకు చేస్తున్న నర్సయ్య తన సొంత ట్రాక్టర్‌తో దుక్కిదున్నడానికి వెళ్లాడు. పనిముగిసిన తరువాత చెరువు పైనుంచి వస్తుండగా బోల్తాపడింది. ఈ ఘటనలో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కొడుకు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్‌షాపులపై దాడులు

ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలం హాజీపూర్, లింగంపేట మండల కేంద్రంలోని పర్మళ్లలోని బెల్ట్‌షాపులపై పోలీసులు దాడులు చేశారు. హాజీపూర్‌లో రూ.2,986 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. బెల్ట్‌షాప్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామన్నారు. లింగంపేట మండల కేంద్రంలోని పర్మళ్లలోని బెల్ట్‌షాపుపై మంగళవారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడిచేసినట్లు ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ తెలిపారు. అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారన్నారు.

యువతి అదృశ్యం

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని బంజపల్లికి చెందిన యువతి అదృశ్యమైందని ఎస్సై సుధాకర్ తెలిపారు. గత నెల 29న రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన యువతి తిరిగిరాకపోవడంతో తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

మాచారెడ్డి: మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి కామారెడ్డి ద్వితీయశ్రేణి న్యాయమూర్తి శివరాత్రి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.200 జరిమాన విధించినట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ బుధవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, నిబంధనలను అతిక్రమిస్తే శిక్ష తప్పదని ఎస్సై స్పష్టం చేశారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని స్కానింగ్ సెంటర్లలో పోలీసులు రెండు రోజులుగా తనిఖీలు చేపడుతున్నారు. డీసీపీ శేషాద్రిరెడ్డి ఆధ్వర్యంలో రెండోరోజైన బుధవారం తనిఖీలు కొనసాగాయి. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్య నేరమని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీసీపీ హెచ్చరించారు.

బాలికపై అత్యాచార యత్నం!

బిచ్కుంద: మండలానికి చెందిన ఓ బాలికపై సామూహిక అత్యాచార యత్నం జరిగినట్లు తెలిసింది. ఈ ఘటనలో పోలీసులు నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. బాధితురాలిని బాలికా సంరక్షణ కేంద్రానికి తరలించారని తెలిసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు. 9310515624, 8800496710. [G-1468]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు ఫ్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217 [M-1185057]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని/ వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K Ph: 8977639662 /8977639663 [H-799874]

■ Wanted Collection Executives, Team Leaders & Tele-Callers to work for Nationalised Banks with DRA Certification.9177657494,9348290349 [HA-2384]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పీహెచ్‌సీలకు నిధులు అందేనా?



ఎంపికైన కిసాన్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- ఎన్‌క్యూఏఎస్ ఎంపిక చేసి రెండేళ్లు
- నిధుల కోసం ఎదురుచూపులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వైద్యాధికారులు

బాల్కొండ: ప్రజలకు వైద్య సేవలందించడంలో జాతీయ స్థాయి ప్రమాణాలను పాటించే ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు మంజూరుకావడం లేదు. పీహెచ్‌సీలకు ప్రతి ఏడాది నిధులు మంజూరు కావాల్సి ఉండగా, రెండేళ్లుగా చిల్లిగవ్వ రాలేదు. ప్రతి సంవత్సరం కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎన్‌క్యూఏఎస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్) బృందం ఎంపిక చేస్తుంది. ఇలా ఉమ్మడి బాల్కొండ మండలంలో పోచంపాడ్, మెండోరా, కిసాన్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గత రెండేళ్లలో ఎంపికయ్యాయి. బృందం పర్యవేక్షణకు వచ్చిన సమయంలో పీహెచ్‌సీలను జాతీయ వైద్య ప్రమాణాలకు అనుగుణంగా తీర్చి దిద్దాలి. అందు కోసం వైద్యాధికారులు చాలానే వెచ్చించారు. ఎన్‌క్యూఏఎస్ ఎంపిక చేసి రెండేళ్లు గడుస్తున్నా నిధులు మంజూరుకాకపోవడంతో వైద్యాధికారులపై తీవ్ర ఆర్థికభారం పడుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులను మంజూరు చేయాలని వైద్యాధికారులు కోరుతున్నారు.

ఎంపికైతే..

ఎన్‌క్యూఏఎస్ బృందం పీహెచ్‌సీని ఎంపిక చేస్తే నాలుగు సంవత్సరాల వరకు పీహెచ్‌సీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులను కేటాయిస్తుంది. పీహెచ్‌సీ పరిధిలోని జనాభా, హెల్త్ సబ్‌సెంటర్ల ప్రతిపాదన నిధులను మంజూరు చేస్తుంది. 2.75లక్షల నుంచి రూ.4 లక్షల వరకు నాలుగేళ్లపాటు కేటాయిస్తుంది. కానీ రెండేళ్లుగా నిధుల మంజూరుకు మోక్షం లభించడం లేదు. కేటాయించిన నిధుల్లో నుంచి నిర్వహణ ఖర్చులు, అభివృద్ధికి, అలవెన్స్‌లు తీసుకోవచ్చు. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఐదేళ్లు గడిచినా నిధులు రాలేదని తెలిసింది. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ప్రత్యేక నిధులు విడుదల అయ్యేలా చూడాలని వైద్యులు, ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా విడుదల కాలేవు

ఎన్‌క్యూఏఎస్ బృందం ఎంపిక చేసిన పీహెచ్‌సీలకు అందే ప్రత్యేక నిధులు రాష్ట్ర వ్యాప్తంగా విడుదల కాలేవు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉంది.

– డాక్టర్, రమేశ్,
డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూర్

వరిపంటకు మంటలు



తాడ్కోల్‌లో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న పోలీసులు

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ శివారులో గంగారాం అనే రైతుకు చెందిన సుమారు 2ఎకరాల వరిపంట బుధవారం ప్రమాదవశాత్తు పాక్షికంగా దగ్ధమైంది. గంగారాం 7ఎకరాల్లో వరి సాగు చేయగా.. ప్రస్తుతం కోత దశకు వచ్చింది. పంట నూర్పిడి చేసిన చుట్టుపక్కల రైతులు కొయ్యలను కాల్చేందుకు నిప్పు పెట్టగా గంగారాం సాగు చేసిన వరిపంట వరకు మంటలు వ్యాపించాయి. స్థానిక రైతులు, గ్రామస్తులు మంటలను ఆర్పివేశారు. బాన్సువాడ పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. అలాగే హన్మాజీపేట్ గ్రామంలోనూ చాకలి సాయవ్వ అనే రైతు సాగు చేసిన జొన్నపంటకు మంటలు అంటుకున్నాయి. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని రైతును పరామర్శించారు. కాలినజొన్నలు కాంటా పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట నాయకులు బోనాల సుభాష్, సంజీవులు, వెంకాగౌడ్, సింగం సంతోష్ తదితరులున్నారు.

చిక్కడపల్లిలో గడ్డివాము దగ్ధం

రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లిలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించి సాజిద్ అనే రైతుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. సాజిద్ పశువుల మేత కోసం సుమారు రెండు వందల గడ్డి కట్టలను గ్రామ శివారులో నిల్వ ఉంచగా, ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి.

కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్‌నాగారం: జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అంద్యాల లింగయ్య, ఉపాధ్యక్షులుగా ఎంవీ సుబ్బారావు, శ్రవణ్‌రెడ్డి, బొబ్బిలి నర్సయ్య, ఎస్‌కే హైదర్, సీహెచ్ గంగారెడ్డి, జనరల్ సెక్రెటరీగా కె.గంగాధర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా జె.రాజేశ్వర్, ఎస్.శ్రీనివాస్, ఎం.ప్రశాంత్, ఎం.రాజేందర్, వి.అనురాధ, కోశాధికారిగా జి.సురేందర్, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్లుగా కె.గంగాధర్, హరిచరణ్, ఎం.వినోద్‌నాయక్, కె.గంగారెడ్డి, బి.సంతోష్, కె.శంకర్, రాజుసిర్ప, పి.జ్యోతి, ఎన్.శ్రీనివాస్, రమేశ్ ఎన్నికయ్యారు.

ఓటరు జాబితా లేకుండానే..

ఓటరు జాబితాను బహిర్గతం చేయకుండా నూతన కమిటీని ఎన్నికల అధికారి బొబ్బిలి చిన్నారెడ్డి ప్రకటించారు. నిబంధనల ప్రకారం ఓటరు జాబితాను బహిర్గతం చేయాల్సి ఉన్నప్పటికీ బయటపెట్టలేదు. నామినేషన్లు స్వీకరించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. కొంత మంది పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఓటరు జాబితా ప్రకటించలేదని, తూతూ మంత్రంగానే ఎన్నికల ప్రక్రియ కొనసాగించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పరిస్థితి విషమించి యువకుడి మృతి

కమ్మర్‌పల్లి: మండల కేంద్రం శివారులో ఆదివారం బైక్‌ను ఆటో ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలపాలైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన శ్రీరాముల శ్రీకాంత్(32) ఆదివారం బైక్‌పై ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి వెళ్లాడు. కోరుట్లకు తిరిగి వెళ్తుండగా కమ్మర్‌పల్లి శివారులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద ఎదురుగా వస్తున్న ఆటో.. బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

నర్సింగ్‌పల్లికి చెందిన మరొకరు..

మోపాల్: జీవితంతపై విరక్తితో గతనెల 26న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని నర్సింగ్‌పల్లికి చెందిన రాజు (40) చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెయింటర్‌గా పనిచేసే రాజుకు గత కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో గత నెల 26న జీవితంపై విరక్తిచెంది స్పిరిట్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థి ఆత్మహత్యాయత్నం

నవీపేట: పదో తరగతిలో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని మహంతంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన హోంగార్డ్ రమేశ్ కుమారుడు సాయిచరణ్ నవీపేటలోని టీఎస్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదివి పరీక్షలు రాశాడు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో సాయిచరణ్ 8.3 గ్రేడ్‌తో పాసయ్యాడు. దీంతో తనకు తక్కువ మార్కులు వచ్చాయని ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పి బాధపడిన సాయిచరణ్ బుధవారం ఉదయం పొలాల్లో చల్లే గడ్డి మందు తాగాడు. వాంతులు కావడంతో తండ్రి రమేశ్‌కు తాను గడ్డిమందుతాగిన విషయం చెప్పాడు. వెంటనే సాయిచరణ్‌ను జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బోధన్‌లో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బోధన్‌టౌన్(బోధన్): బాన్సువాడ నుంచి బోధన్ వైపునకు వస్తున్న బొలేరో వాహనంలో మంటలు చెలరేగాయి. పట్టణ శివారులోని రమాకాంత్ ఫంక్షన్‌హాల్ సమీపంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వాహనంలోని అట్టలకు మంటలు అంటుకున్నట్లు గమనించిన స్థానికులు వాహనం డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే డ్రైవర్ వాహనాన్ని పక్కకు నిలిపి అట్టలను కిందపారవేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

క్లుప్తంగా...

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డి కోరారు. గాంధీభవన్‌లో బుధవారం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల యూత్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. సమావేశంలో అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పాటు మూడు జిల్లాల యువజన కాంగ్రెస్ నాయకులు సమావేశమై కార్యాచరణ గురించి చర్చించారు. ప్రతి పట్టభద్రుడిని కలిసి ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఆవశ్యకతను వివరించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ పక్షాన తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఓయూకి నిధులివ్వకుండా బీఆర్ఎస్ నిర్లక్ష్యం

- అధికార ప్రతినిధి చనగాని దయాకర్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉస్మానియా యూనివర్సిటీకి నిధులు, నియామకాలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఓయూకు కేసీఆర్ చేసింది శూన్యమని, ఉస్మానియా భూములు అమ్ముకున్నారని మండిపడ్డారు. గతంలో 1,200 మంది అధ్యాపకులు ఉంటే ప్రస్తుతం 320 మంది ఉన్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో జరిగిన భూ లావాదేవీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని దయాకర్ డిమాండ్ చేశారు. ఓయూలో డ్రైనేజీ వ్యవస్థ చాలా దారుణంగా ఉన్నా.. ఒక్క రోజు కూడా పట్టించుకోలేదన్నారు. ఓయూ వందేళ్ల ఉత్సవాల్లో భారీగా అవినీతి జరిగిందని, ఉత్సవాల కాంట్రాక్టు కేటీఆర్ సన్నిహితులకు ఇచ్చారని తెలిపారు. ప్రైవేటు యూనివర్సిటీలకు కేటీఆర్ అనుమతిచ్చి విద్య దోపిడీకి పాల్పడ్డారని దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బస్తర్‌లో నేలకొరిగిన తొలితరం మావోయిస్టు

టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తెలంగాణ నేతలు ● మృతుల్లో చీమల నర్సయ్య, కాసరవెల్లి వినయ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/బెల్లంపల్లి: బస్తర్‌లో మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్–కాంకేర్ సరిహద్దులో టేక్‌మెటా సమీపంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో బస్తర్‌లో నక్సలైట్ ఉద్యమాన్ని ప్రారంభించిన తొలితరం నేతల్లో ఒకరైన చీమల నర్సయ్య ఆలియాస్ జోగన్న, కాసరవెల్లి వినయ్ ఆలియాస్ రవి నేలకొరిగారు. మృతుల ఫొటోలు బయటకు రావడంతో వారి కుటుంబసభ్యులు ఛత్తీస్‌గఢ్‌కు పయనమయ్యారు.

పార్టీ విస్తరణలో నర్సయ్య కీలకపాత్ర

1980వ దశకంలో నక్సలైట్ ఉద్యమం తెలంగాణలో ఊపందుకుంది. కొండపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పట్టు సాధించింది. ఇదే సమయంలో ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం నిర్బంధం పెంచింది. ఈ క్రమంలో తెలంగాణలో తొలి ఎన్‌కౌంటర్ 1982 చివరలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చినమెట్‌పల్లి దగ్గర జరగ్గా, అంకం నారాయణ, మాసం గజేందర్ చనిపోయారు. ఆ వెంటనే 1983 ఫిబ్రవరి 3న పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత గణపతి సమకాలికుడు బయ్యపు దేవేందర్‌రెడ్డి మరణించారు. ఆ తర్వాత



ఏప్రిల్‌లో జరిగిన మూడో ఎన్‌కౌంటర్ తెలంగాణ సరిహద్దు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అంకీస దగ్గర జరగగా పెద్ది శంకర్ ప్రాణాలు కోల్పోయారు. దీంతో చైనాలో మావో జెడాంగ్ అనుసరించిన వ్యూహం తరహాలో మైదాన ప్రాంతంతోపాటు అటవీ ప్రాంతంలో మరో షెల్టర్ జోన్ కోసం ఆనాటి నక్సలైట్లు అన్వేషణ సాగించారు. ఈ క్రమంలో బస్తర్ అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని తొలి బ్యాచ్‌ను 1982లో అక్కడకు పంపారు. అలా వెళ్లిన తొలితరం నాయకుల్లో చీమల నర్సయ్య కూడా ఉన్నారు. ఇతని స్వగ్రామం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని జయ్యారం. 42 ఏళ్లుగా బస్తర్‌లో పనిచేస్తూ సాయుధ విప్లవానికి బస్తర్ అడవులను కేంద్ర స్థానంగా నిలపగలిగారు. ఇప్పటికీ 'రెడ్ కారిడార్'కు బస్తర్ కీలకంగా ఉంది.

సికాస నుంచి వినయ్

కాసరవెల్లి వినయ్‌ని పార్టీ అగ్రనేత కటకం సుదర్శన్ శిష్యుడిగా చెప్పుకుంటారు. వినయ్ తండ్రి రాజయ్యకు సింగరేణిలో ఉద్యోగం రావడంతో కుటుంబంతో సహా బెల్లంపల్లికి వచ్చాడు. 1990లో విద్యార్థి ఉద్యమాల ద్వారా వినయ్ విప్లవాల వైపు ఆకర్షితుడయ్యారు. ఆ తర్వాత సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస)లో కీలకంగా పనిచేశారు. నిర్బంధం ఎక్కువ కావడంతో చెన్నూర్ దళంలో కొంతకాలం పనిచేశాడు. విప్లవ విస్తరణ, మిలిటరీ శిక్షణ, ఆయుధాల తయారీ, సాహిత్యం తదితర పనుల కోసం వినయ్‌ని పార్టీ బస్తర్‌కు పంపించింది. 30 ఏళ్లుగా ఆయన బస్తర్‌లో పార్టీని విస్తరించారు. వినయ్ మరణవార్త తెలుసుకొని ఆయన సోదరుడు వెంకటేష్, కుటుంబ సభ్యులు బుధవారం బస్తర్‌కు బయలుదేరారు. గురువారం వినయ్ మృతదేహాన్ని అతడి స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి తరలించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.

పదిలో 8 మంది గుర్తింపు..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నారాయణపూర్ జిల్లాలోని టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల వివరాలను బస్తర్ పోలీసులు బుధవారం ప్రకటించారు. మొత్తం పది మంది చనిపోగా ఎనిమిది మందిని గుర్తించారు. ఇందులో ముగ్గురు తెలంగాణకు చెందిన వారు ఉన్నారు. మృతుల్లో పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం జయ్యారం గ్రామానికి చెందిన చీమల నర్సయ్య అలియాస్ జోగన్న ఆలియాస్ జీను(66), కాసరబోయిన విన య్ (చెన్నూరు, మంచిర్యాల జిల్లా), సుస్మితా అలియాస్ చైతే (వరంగల్), సంగీత అలియాస్ ఆత్రం డోగే (జోగన్న భార్య, అహేరి, గడ్చి రోలి జిల్లా, మహారాష్ట్ర), సురేశ్ (పశ్చిమ బస్తర్), మల్లేశ్ అలియాస్ మడకం ఉంగా (బస్తర్), పాడి యం కోషి (చింతగుప్ప, సుక్మా), కమ్లీ (కిష్టారం, సుక్మా జిల్లా)లు ఉన్నారు. కాగా, జోగన్న ప్రస్తుతం స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా ఉన్నారు. ఇతనిపై 196 క్రిమినల్ కేసులు నమోదు అవగా రూ.25 లక్షల రివార్డు ఉంది.

పర్యావరణ ప్రతిభా అవార్డులకు పీసీబీ దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్ (హైదరాబాద్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) ఆధ్వర్యంలో ప్రతిఏటా అందించే పర్యావరణ ప్రతిభ అవార్డులకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు సీనియర్ సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ నిషేధం, నీటిపొదుపు, వాయు కాలుష్య నియంత్రణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశాల్లో విశేష కృషి చేస్తున్న సంస్థలకు ఈ అవార్డులు అందిస్తారని పేర్కొన్నారు. ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలు, స్వయం సహాయక బృందాలు, పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తమ దరఖాస్తులను సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ పర్యావరణ విద్యా విభాగంలో ఈ నెల 15 లోపు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 91773 03127 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

7న బీసీ సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం

- ఆర్.కృష్ణయ్య వెల్లడి



కాచిగూడ (హైదరాబాద్): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీసీ సమస్యలపై చర్చించి, ఎన్నికల్లో బీసీలు అనుసరించాల్సిన విధానాలపై తగిన నిర్ణయాలు తీసుకోవడానికి మే 7వ తేదీన కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జాతీయ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహి స్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. ప్రజాస్వామ్య దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాలక పార్టీలు బీసీలకు ప్రభుత్వంలో వాటా ఇవ్వకుండా కేవలం ఓటు వేసే వ్యక్తులుగానే చూశాయని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, వాటాదారులని పాలక పార్టీలకు తెలిసివచ్చేలా దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీల వాటా బీసీలకు ఇవ్వకపోతే దేశంలో తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. బీజేపీలో ఉన్న బీసీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై, పార్టీ జాతీయ నాయకత్వంపై ఒత్తిడి తెచ్చి బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కార మయ్యేలా చూడాలని ఆర్.కృష్ణయ్య కోరారు.

ఆ ఈవీఎంల వినియోగానికి హైకోర్టు ఓకే

- మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంలు.. లోక్‌సభ ఎన్నికల్లో వాడుకునేందుకు ఈసీకి అనుమతి
- మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ వజ్రేష్‌యాదవ్ పిటిషన్
- విచారణ చేపట్టిన హైకోర్టు.. ప్రతివాదులకు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలు, వీవీప్యాట్లు పార్లమెంట్ ఎన్నికల్లో వాడుకునేందుకు ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అలాగే మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున మల్లారెడ్డి, కాంగ్రెస్ తరఫున వజ్రేష్‌యాదవ్ పోటీ చేశారు. 33 వేల మెజారిటీతో మల్లారెడ్డి విజయం సాధించారు. అయితే అఫిడవిట్‌లో మల్లారెడ్డి తప్పుడు సమాచారం ఇచ్చారని.. నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలన్నీ ఇవ్వలేదని ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ వజ్రేష్ యాదవ్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. సమీప అభ్యర్థి అయిన తనను ఎమ్మెల్యేగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వజ్రేష్ తరఫున న్యాయవాది సిర్థ పోగుల దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. ఎన్నికల కమిషన్, మేడ్చేల్ ఆర్డీవో, అసెంబ్లీ కార్యదర్శి, మల్లారెడ్డితో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. అయితే కేసు కారణంగా గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్లను వాడుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఈసీ మధ్యంతర పిటిషన్ దాఖలు చేయగా, అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డికి నోటీసులు

జనగామ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి (బీఆర్ఎస్) ఎన్నికను సవాల్ చేస్తూ కొమ్మూరి ప్రతాపరెడ్డి(కాంగ్రెస్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమీప ప్రత్యర్థినైన తనను శాసనసభ్యుడిగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై కూడా న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. వాదన తర్వాత.. రాజేశ్వర్‌రెడ్డి సహా ఇతర ప్రతివాదులకు న్యాయమూర్తి నోటీసులు జారీ చేస్తూ, విచారణను జూన్ 14కు వాయిదా వేశారు.

దిశ కేసులో పోలీసులకు ఊరట

సిర్పూర్కర్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలపై హైకోర్టు స్టే



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ అత్యాచారం, హత్యకు సంబంధించి నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో పోలీసు అధికారులకు హైకోర్టులో ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిర్పూర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇప్పుడే ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. తాము తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు స్టే ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేస్తూ, విచారణను జూలై 10కి వాయిదా వేసింది.

ఆ నివేదిక సరిగా లేదంటూ హైకోర్టును ఆశ్రయించిన పోలీసులు

➡ 2019లో దిశ అత్యాచారం, హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. ఈ కేసులోని నిందితులను కొద్ది రోజులకే పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఎన్‌కౌంటర్‌పై ఆరోపణలు రావడంతో ఈ ఘటనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సిర్పూర్కర్ కమిషన్‌ను నియమించింది. దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కమిషన్ 2022లో అందజేసిన నివేదికలో సూచించింది. పోలీసు అధికారులపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి విచారణ జరపాలని పేర్కొంది. అయితే దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి సిర్పూర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక సరిగా లేదని, దాని ఆధారంగా తమపై చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్ సహా పలువురు పోలీసులు, ఫరూక్‌నగర్ ఇంచార్జి ఎమ్మార్వో పాండు హైకోర్టును ఆశ్రయించారు.

అప్పటివరకు చర్యలొద్దన్న హైకోర్టు

ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. సీనియర్ న్యాయవాదులు వేణుగోపాల్, రచనారెడ్డి, హేమేంద్రనాథ్ పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ వరకు అధికారులపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు. కాగా, 'దిశ' ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పలుప్రజాప్రయోజన వ్యాజ్యాలు, రిట్ పిటిషన్లు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

'పుర' సమస్యలకు పరిష్కారమేదీ..?

- నూతన చైర్‌పర్సన్‌కు సమస్యల సవాళ్లు
- రూ. 40కోట్ల అప్పుల్లో బల్దియా
- మున్సిపల్ స్థలాలకు భద్రత కరువు
- యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు



నిలిచిన సమీకృత, శాకహార మార్కెట్ పనులు



విస్తరణకు నోచుకోని నిజాంసాగర్ చౌరస్తా

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి బల్దియాకు చైర్‌పర్సన్‌గా నియమితులైన ఇందుప్రియ ఎదుట సమస్యలు సవాళ్లు విసురుతున్నాయి. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న మున్సిపాలిటీ ప్రస్తుతం రూ. 40 కోట్లకు పైగా అప్పుల్లో ఉండటమే కాకుండా ఖజానా ఖాళీ అయ్యింది. ప్రతీనెల కార్మికులకు వేతనాలను ఇచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రూ.కోట్ల అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సందర్భంగా పట్టణంలో ప్రధాన సమస్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

విద్యుత్ బిల్లులు రూ. 16 కోట్లకు పైనే..

గ్రేడ్–2 మున్సిపల్‌గా లక్షన్నరకు పైగా జనాభా ఉన్న కామారెడ్డి బల్దియాకు బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేయగా, ఏటా రూ. 8 కోట్లకుపైగా పన్నుల రూపేనా ఆదాయం సమకూరుతుంది. ప్రస్తుతం బల్దియా రూ. 40కోట్లకు పైగా అప్పుల్లో కూరుకుపోయింది. రూ. 16 కోట్లు విద్యుత్ బిల్లులు, కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ రూ. 4 కోట్లుకు పైగా, మరో రూ. 20 కోట్లు అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులు ఉన్నాయి. అంతే కాకా ఇంకా రూ. 20కోట్లకు పైగా టెండర్లు నిర్వహించిన పనులు ప్రారంభం కావాల్సి ఉంది. రాజకీయ నేతల అండతో పట్టణంలో సుమారు 2వేలకు పైగా భవనాలకు ఆస్తి పన్నులు వేయకుండా ఆదాయానికి గండి కొడుతున్నారు.

విస్తరణకు నోచుకోని జంక్షన్లు, రోడ్లు

పట్టణంలోని నిజాంసాగర్‌చౌరస్తాలో రెండు చోట్ల, ఇందిరాచౌక్, రామారెడ్డిరోడ్, కొత్తబస్టాండ్, మున్సిపల్ ఎదురుగా జంక్షన్‌లను విస్తరణ చేయాల్సి ఉండగా ఏళ్లగా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా సిరిసిల్లారోడ్, జన్మభూమిరోడ్, బస్టాండ్ రోడ్, అశోక్‌నగర్‌కాలనీ, పాత బస్టాండ్ నుంచి అడ్లూర్ వరకు, పెద్దబజార్, సైలానీబాబా కాలనీ తదితర రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. సుభాష్‌రోడ్, జేపీఎన్, మాయాబజార్, నాజ్‌టాకీస్‌రోడ్, స్టేషన్‌రోడ్‌లో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. పట్టణంలో 5 కి.మీ మేర 15ఏళ్ల క్రితం రూ.16.50 కోట్లతో చేపట్టిన వాటర్‌స్ట్రామ్ బడా డ్రైనేజ్ పనులు పూర్తి కాకాపోవడంతో అధ్వానంగా ఉండటం పట్ల చిన్నపాటి వర్షాలకే రోడ్లన్ని జలమయం అవుతున్నాయి. స్టేషన్‌రోడ్, విద్యానగర్, నిజాంసాగర్ చౌరస్తాలో చూస్తే అర్థమవుతుంది. ఇక సిరిసిల్లారోడ్‌లోని రాజీవ్ పార్క్ కళావిహీనంగా మారింది. అన్ని వార్డుల్లో ఏర్పాటు రూ. 2 కోట్లకు పైగా నిధులతో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు పిచ్చి మొక్కలతో వికృతంగా మారాయి.

అంతిమయాత్రకు నరకమే..

పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీ, జాతీయ రహదారి పక్కన కామారెడ్డి చెరువు వద్ద ఉన్న వైకుంఠదామాలు అభివృద్ధికి రూ. 2 కోట్లు వెచ్చించి పనులు చేపట్టారు. అక్కడ అసంపూర్తిగా పనులు ఉన్నాయి. గతంలో 'సాక్షి'లో కూడా కథనం రావడంతో అభివృద్ధికి హామీ ఇచ్చిన బల్దియా అధికారులు, పాలకులు ప్రస్తుతం ఊసెత్తడం లేదు.


కొనసాగుతున్న పనులు

రూ. 37.50లక్షలతో 15ఏళ్ల క్రితం సుభాష్‌రోడ్‌లో నిర్మించిన 46 మాసం విక్రయదుకాణాలు వృథాగా ఉండి ఇప్పటి వరకు నయా పైసా ఆదాయం రావడం లేదు. గాంధీ గంజ్‌లో అగష్టు 2021లో రూ.7.20కోట్లతో పనులు ప్రారంభించిన సమీకృత మాసం, శాఖహార దుకాణాల పనులు 30శాతం పనులు కూడా పూర్తి కాలేవు. అక్కడే పక్కన నాలుగేళ్ల క్రితం రూ. 50లక్షలతో నిర్మించి కూరగాయల మార్కెట్ షెడ్లు ఉండి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. రూ. 9.20కోట్లతో కొత్తబస్టాండ్ నుంచి హౌజింగ్ బోర్డు వరకు మురికి కాలువ, ఫుట్ ఫాత్ పనులు నిలిచిపోయాయి.

అక్రమ నిర్మాణాలకు అడ్డులేదు

పట్టణంతో పాటు, విలీన గ్రామాలు, వెంచర్‌లలో సుమారు 200లకు పైగా బల్దియా ఓపెన్ స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాలకు రక్షణగా కంచెలు లేవు. రెవెన్యూ శాఖ ధ్రువీకరించిన వీక్లీమార్కెట్ రోడ్ ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురయ్యాయి. గంజ్ గేటు ముందు 400గజాల స్థలం కబ్జాకు యత్నిస్తోన్నరు. హౌజింగ్‌బోర్డులో 1000 గజాల స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు బోర్డులు పాతారు. అశోక్‌నగర్, అయ్యప్ప ఆలయం వద్ద, దేవునిపల్లి, స్నేహపూరికాలనీ, విద్యానగర్, వీక్లీమార్కేట్ తదితర ప్రాంతాల్లో సర్కారు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి.

అభివృద్ధి చేసి చూపిస్తాం



పట్టణంలోని మున్సిపల్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతాం. మాకు అతితక్కువ 8 నెలలు పాలించేందుకు గడువు ఉంది. అయినా ప్రధాన సమస్యలన్ని పరిష్కరిస్తాం. మున్సిపల్‌కు ఆదాయ మార్గాలపై దృష్టి సారిస్తాం. అభివృద్ధి పనులు చేసి చూపిస్తా. కౌన్సిలర్‌లందరికి సమన్వంతో ముందుకు వెళ్తా. పట్టణ ప్రజలు తమకు సహకరించాలి.

– గడ్డం ఇందుప్రియ, చైర్‌పర్సన్, కామారెడ్డి

లాభదాయకంగా పొగాకు పంట



పొగాకు పంటను చూపుతున్న రైతు

- సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- హజ్గుల్‌లో 450 ఎకరాల్లో సాగు
- ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి. ఎకరానికి రూ. లక్ష ఆదాయం



బట్టీలో తోరణాల పద్ధతిలో ఎండబెట్టిన ఆకు

బిచ్కుంద(జుక్కల్) : ప్రతిఏటా అతివృష్టి అనావృష్టితో రైతులు వరి, సోయా, కంది, శనగ, మొక్కజొన్న ఇతర పంటలు వేసి నష్టాలను చూస్తున్నారు. దిగుబడి వచ్చిన గిట్టుబాటు ధర లేక లాభాలు పొందడం లేదు. మండలంలోని హజ్గుల్ గ్రామ రైతులు గత పదేళ్ల నుంచి ఈ పంటలకు స్వస్తి చెప్పి ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంటల సాగుపై దృష్టి మళ్లించి అత్యంత ఖరీదైన పొగాకు పంట సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. రైతుశ్రమ, సాగు ఖర్చు అధికంగానే ఉన్నా అందుకు ప్రతిఫలంగా లక్షల ఆదాయం సమకూరడంతో హజ్గుల్‌లో రైతులు గత పదేళ్ల నుంచి పొగాకు సాగుకు మొగ్గుచూపుతున్నారు.

నాలుగు నెలల పంట..


పొగాకు సాగు నాలుగు నెలల పంట రబీ సీజన్ ఆగస్టు నెలలో మడిలో విత్తనాలు వెదజల్లి నారు వేస్తారు. నెల రోజుల తర్వాత భూమిని చదును చేసి నీటిని వదిలి మొక్కకు మొక్క మధ్య రెండు అడుగులలో నాటుతారు. ఎకరానికి 6 వేలు మొక్కలు నాటుతారు. వీటికి అడుగు మందు డీఏపీ ఇతర కాంప్లెక్స్ ఎరువులు మూడుసార్లు వేస్తారు. నేల స్వభావాన్ని బట్టి మూడు నాలుగు సార్లు నీటి తడి ఇవ్వాల్సి ఉంటుంది. వీటికి ఎక్కువగా చీడపీడలు ఆశించవని రైతులు అంటున్నారు. భూమి చదునుకు ట్రాక్టర్ ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, ఆకులు తెంపి బట్టీలలో ఆరబెట్టడం, కూలీల ఖర్చులతో కలిపి ఎకరాకు పెట్టుబడి రూ.45 నుంచి 50 వేలు ఖర్చు అవుతుంది. పంట దిగుబడి ఎకరాకు 10 నుంచి 13 క్వింటాలు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో పొగాకు క్వింటాలు ధర రూ. 13 వేలు పలుకుతుంది. రూ. 50వేలు పెట్టుబడి ఖర్చులు పోయిన తర్వాత ఎకరాకు లక్ష ఆదాయం వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంట కొనుగోలుకు ముందుగానే తంబాకు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకోవటంతో అమ్మడానికి ఇబ్బందులు ఉండవని హజ్గుల్ గ్రామ రైతులు గత పదేళ్లుగా పొగాకు పంటలు సాగుచేసి లక్షల ఆదాయం పొంది ఆదర్శంగా నిలుస్తున్నారు. నాటిన మూడు నెలలకు పంట కోతకు వస్తుంది ఆకులు ఎంత పెద్దగా ఉంటే అంత ఎక్కువ దిగుబడి వస్తుందంటున్నారు.

బట్టీల్లో ఎక్కువ శ్రమ..

కూలీల ద్వారా మూడు నాగులు దఫాల్లో ఆకులు తెంపుతారు. బట్టీ తయారీ కోసం పంట చేలలో పదిహేను అడుగుల ఎత్తున కట్టెలు పాతి చుట్టు పాల్తీన్ కవర్‌తో కడతారు గాలి బయటకు వెళ్లకుండా బట్టీ తయారు చేస్తారు. తెంపిన ఆకులను కూలీల చేత దారంలో పేర్చి తోరణాల పద్ధతిలో బట్టీలో కడతారు. లోపల కట్టెలు ఇతర గడ్డితో పొగ పెడతారు పచ్చగా ఉన్న ఆకులు పొగతోనే వారం రోజులలో ఎండిపోయి పొగాకు(తంబాకు)గా మారుతుంది. ఒక ఎకరం పంటను బట్టీలో ఆరబెట్టడానికి కనీసం 20 రోజులు పడుతుంది. రైతు శ్రమ అధికంగా బట్టీవద్దనే ఉంటుంది. బట్టీ పొగతోనే నెంబర్ వన్ క్వాలిటీ పొగాకు తయారు అవుతుందని రైతులు అంటున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు ఇవ్వడం లేదని పొగాకు పంటపై అవగాహన లేదంటున్నారని రైతులు పేర్కొంటున్నారు. పొగాకు పండించే రైతులు ఒకరినొకరు సలహాలు, సూచనలు చేసుకుంటున్నారు పొగాకు సాగులో నష్టాలు లేకుండా ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వ్యవసాయ అధికారులు సూచనలు ఇస్తే అధిక దిగుబడులు పొంది లాభాలు పొందవచ్చని రైతులు అంటున్నారు.

పదిలో సత్తా చాటిన కేజీబీవీలు

- 9 కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణత
- 94.31 శాతం ఉత్తీర్ణత



నిజాంసాగర్ కస్తూర్బాగాంధీ విద్యాలయం

నిజాంసాగర్(జుక్కల్): అనాథ, డ్రాప్ అవుట్ బాలికలకు విద్యను అందించడమే లక్ష్యంగా కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు సరస్వతి నిలయాలుగా నిలుస్తున్నాయి. కేజీబీవీల్లో విద్యను అభ్యసించిన విద్యార్థినులు పదోతరగతి ఫలితాల్లో సత్తా చాటారు. జిల్లాలో 19 కేజీబీవీలు ఉన్నాయి. 720 మంది బాలికలు పదోతరగతి పరీక్షలు రాయగా 679 బాలికలు పాసయ్యారు. 94.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. 19 కేజీబీవీలకు 9 విద్యాలయాల్లోని విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ విద్యార్థినులు పదోతరగతితో పాటు ఇంటర్‌లోనూ మంచి ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలోని భిక్కనూర్, బీబీపేట, దోమకొండ, జుక్కల్, మాచారెడ్డి, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, రాజంపేట, రామారెడ్డి మండలాల్లోని కేజీబీవీలు వందశాతం ఉత్తీరత సాధించాయి.

కేజీబీవీ	పరీక్షరాసిన వారు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం				
బాన్సువాడ	34	27	79.41	లింగంపేట	44	41	93.18
భిక్కనూర్	33	33	100	మాచారెడ్డి	24	24	100
బీబీపేట	45	45	100	మద్నూర్	46	39	85
బిచ్కుంద	43	39	90.70	నాగిరెడ్డిపేట	38	38	100
బీర్కూర్	48	46	95.83	నిజాంసాగర్	42	42	100
దోమకొండ	33	33	100	పిట్లం	40	38	95
గాంధారి	33	28	84.85	రాజంపేట	39	39	100
జుక్కల్	40	40	100	రామారెడ్డి	32	32	100
కామారెడ్డి	22	21	95.45	తాడ్వాయి	41	39	95.12
				ఎల్లారెడ్డి	43	35	81.40